పెరిగిన ఓటింగ్ శాతం



● గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్

బంజారాహిల్స్, మే 13(ఆంధ్రజ్యోతి): ఎన్నడూ లేని విధంగా కాలనీ ఓటర్లు పార్లమెంట్ ఎన్నికల్లో బయటకొచ్చారు. ఏపీలో అసెంబ్లీతో పాటు పార్లమెంట్ ఎన్నికలు జరుగుతుండడంతో పెద్ద ఎత్తున ఓటర్లు స్వగ్రామంలో ఓట్లు వేసేందుకు నగరం నుంచి తరలి వెళ్లారు. దీంతో ఓటింగ్ శాతం తగ్గుతుందని అందరూ అంచనా వేశారు. అనూహ్యంగా 2019పార్లమెంట్ ఎన్నికల మాదిరిగానే పోలింగ్ జరిగింది. ఇందుకు కారణం ఎప్పుడూ ఓటు వేయడానికి విముఖత చూపే కాలనీ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముఖ్యంగా ఖైరతాబాద్ నియోజకవర్గంలోని కాలనీల్లో పోలింగ్ బూత్‌లు ఎప్పుడూ వెలవెలబోయేవి. కానీ ప్రస్తుత ఎన్నికల్లో మాత్రం ఓటర్లతో కళకళలాడాయి. జూబ్లీహిల్స్ ఫిలింనగర్ సొసైటీలకు చెం దిన 8 పోలింగ్ బూత్‌లు జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ క్లబ్, ఫిలింనగర్ క్లబ్‌లో ఉన్నాయి. ఇక్కడ సుమారు 9,800 మంది ఓటర్లు ఉన్నారు. ఎప్పుడు సెలబ్రిటీలు తప్పితే మిగతా వారు వచ్చి ఓటు వేసిన సందర్భాలు లేవు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 2,186 ఓట్లు పోలవ్వగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో సుమారు 2,800 ఓట్లు పోలయ్యాయి. కానీ ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో 5,903 ఓట్లు పోలయ్యాయి. సుమారు 60 శాతం ఓటింగ్ జరిగింది. ఇక బంజారాహిల్స్ డివిజన్‌లోని ఎమ్మెల్యే కాలనీలో ప్రతి సారి ఎన్నికల్లో 47 శాతం ఓట్లు పోలయ్యేవి ఈ సారి మాత్రం 61 శాతం దాటాయి. ప్రశాసన్‌నగర్, మిథులానగర్ లాంటి ప్రాంతాల్లో కూడా ఓటింగ్ శాతం తీవ్రంగా పెరిగిందని రాజకీయ పార్టీలు చెబుతున్నాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మధురానగర్‌లో 35శాతం మించని పోలింగ్ ఈసారి ఏకంగా 45 శాతం నమోదు అయింది. ఈ పెరిగిన ఓటింగ్ ఎవరికి అనుకూలం అనేది రాజకీయ విశ్లేషకులు లెక్కలు వేయడంలో తలమునకలయ్యారు.



ఈవీఎంలు ఉంచిన స్ట్రాంగ్ రూంను సీజ్ చేస్తున్న అధికారులతో పార్టీల ప్రతినిధులు

అర్ధరాత్రి 2 గంటలకు స్ట్రాంగ్ రూంకు సీల్

ఖైరతాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన ఈవీఎంలను, వీవీ పాట్‌ల ను ఉన్నాతాధికారుల ఎదుట స్ట్రాంగ్ రూం లలో భద్ర పరచి పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ఉంచారు. పోలింగ్ బూత్‌లలో ఎన్నికలు ముగిసిన అనంతరం యూసుఫ్‌గుడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఏర్పాటైన రిసెప్షన్ సెంటర్‌లో అప్పగించేందుకు ఈవీఎంలతో కలిసి వెళ్లారు. అక్కడ అధికారులకు అప్పగించేందుకు భద్రపరిచే సరికి రాత్రి 11 కాగా పూర్తి సమాచారం సేకరించిన అనంతరం వారిని పంపించేశారు. అనంతరం ఈవీఎం, వివిపాట్‌లను స్ట్రాంగ్ రూంలలో భద్రపరచే ప్రక్రియ ప్రారంభం కాగా రాత్రి 2 గంటల సమయంలో ఎన్నికల పరిశీలకుల సమక్షంలో స్ట్రాంగ్ రూంకు తాళాలు వేసి సీల్ వేశారు. అక్కడ మూడంచెల పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు. కేంద్ర బలగాలతో పాటు అదనపు బలగాలు, రాష్ట్ర పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



అంజన్ కుమార్ యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న శివశంకర్

కాంగ్రెస్‌లో చేరిన టీడీపీ నేత

ఎర్రగడ్డ, మే 14 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎర్రగడ్డ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఎస్.శివశంకర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం మాజీ పార్లమెంట్ సభ్యుడు ఎం. అంజన్ కుమార్ యాదవ్ సమక్షంలో శివశంకర్ కాంగ్రెస్‌లో చేరారు. కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంజన్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. పలు పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న వారితో పార్టీ మరింత బలపడుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో చందు, దినకర్, సునీల్ కుమార్ తదితరులు ఉన్నారు.

టెట్ అభ్యర్థులకు టి-సాట్ మెలకువలు

● నేటి నుంచి నాలుగు రోజుల పాటు ప్రసారాలు

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): టీఎస్పీఎస్సీ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి జూన్ 3 వ తేదీ వరకు నిర్వహించే టెట్ (టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్)పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు మెలకువలు తెలియజేసేందుకు టి-సాట్ ప్రత్యేక ప్రసార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని టి.సాట్ -సాఫ్ట్ నెట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈనెల 15నుంచి నాలుగు రోజులపాటు ఐదు సబ్జెక్టులపై అనుభవంగల ఉపాధ్యాయులచే ప్రత్యేక లైవ్ కార్యక్రమం ఏర్పాటు చేశామని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. టి-సాట్ నిపుణ చానల్‌లో ఉదయం 11నుంచి 12గంటల వరకు పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు మెలకువలతోపాటు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 15న సైకాలజీ, 16న టీచింగ్ మెథడ్స్, 17న తెలుగు, 18న ఫిజికల్ సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులపై కొనసాగే ప్రసారాలు నిపుణ చానల్‌లో, టి-సాట్ విద్యా చానల్‌లో మరుసటి రోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు పునఃప్రసారమవుతుందన్నారు. ఇప్పటికే టెట్ అభ్యర్థుల కోసం సుమారు 200 ఎపిసోడ్స్ టి-సాట్ యాప్ లో అందుబాటులో ఉన్నాయన్నారు. అభ్యర్థులు తమ సందేహాలు, సమాధానాల కోసం 040-3540326/726, టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 4039 నంబర్లకు కాల్ చేయవచ్చన్నారు.



ఈశ్వరయ్యతో హెచ్‌సీఏ కార్యవర్గ సభ్యులు

హెచ్‌సీఏ ఎథిక్స్ అధికారిగా ఈశ్వరయ్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఎథిక్స్ అధికారిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఈశ్వరయ్య నియమితులయ్యారు. మంగళవారం ఉప్పల్ స్టేడియంలో ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. హెచ్‌సీఏ కార్యదర్శి దేవ్‌రాజ్, ఉపాధ్యక్షుడు దల్జిత్ సింగ్, కోశాధికారి సీజే శ్రీనివాస్, ఈశ్వరయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

నాలాలో పడి గుర్తు తెలియని యువకుడి మృతి



మృతి చెందిన యువకుడు

ఖైరతాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వస్తువులు సేకరిస్తూ జీవనం గడిపే ఓ యువకుడు ఖైరతాబాద్‌లోని నాలాలో పడి మృతి చెందాడు. ఖైరతాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ గుండా హుస్సేన్ సాగర్‌లోకి వెళ్లే బల్కాపూర్ నాలా వద్ద ప్లాస్టిక్ బాటిళ్లు, వస్తువులు సేకరించేందుకు వెళ్లిన యువకుడికి ఫిట్స్ వచ్చాయి. దీంతో అతడు అక్కడ పడిపోయి కొట్టుకుంటూ నాలాలో పడి మృతి చెందాడు. దీన్ని గమనించిన మరో యువకుడు కేకలు వేయడంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వచ్చి అతడి మృత దేహాన్ని వెలికితీసి ఉస్మానియా మార్చురీకి తరలించారు. అతడి పేరు, వివరాలు తెలియరాలేదు. చిత్తుకాగితాలు, ప్లాస్టిక్ వస్తువులు సేకరించి అమ్ముకుంటూ మద్యం తాగుతూ ఉంటాడని పలువురు తెలిపారు.

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఢీకొని ఇద్దరి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 14(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాటసింగారం శివారు చాచా దాబా సమీపంలో విజయవాడ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి సోమవారం అర్ధరాత్రి రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వేగంగా వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి శరీరంపై నీలం రంగు చొక్కా, డార్క్ బ్లూకలర్ ప్యాంటు ఉన్నాయని పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712662650, 8712662293 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మరో ఘటనలో..

పసుమాముల కళానగర్‌కు చెందిన రెవెళ్ల జంగయ్య(40) ఆటో డ్రైవర్. మంగళవారం పనిమీద అబ్దుల్లాపూర్‌మెట్ వెళ్లాడు. విజయవాడ జాతీయ రహదారిపై మయూరి కాంట వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వేగంగా వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం స్థానికంగాగల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మధ్యాహ్నం 3 గంటలకు మృతి చెందాడు.

ఘనంగా శ్రీవారి కల్యాణం



స్వామివారికి శాంతి కల్యాణం చేస్తున్న అర్చకులు



కల్యాణం తిలకించేందుకు విచ్చేసిన భక్తులు

అమీర్‌పేట, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతకు నిలయమైన ఎస్ఆర్‌నగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన స్వామి శాంతి కల్యాణం అశేష భక్త జన సందోహం నడుమ సాగింది. ఈనెల 12న ప్రారంభమైన 29వ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. వైశాఖ శుద్ధ పంచమితో ప్రారంభమై ఉత్సవాలు వైశాఖ శుద్ధ సప్తమితో ముగిశాయి. ఉదయం 6:30 గంటలకు ప్రాతః కాల పూజలతో ప్రారంభమైన ఉత్సవాలు ప్రాణ ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, కలశ జల సంప్రోక్షణ అనంతరం ఉదయం 10:30 గంటలకు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించిన కల్యాణాన్ని వీక్షించిన మహిళా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సకల ఏర్పాట్లు చేసినట్టు చైర్మన్ బొడ్డు కుమార్‌గౌడ్, ఈవో నరేందర్ రెడ్డి వెల్లడించారు. ఉత్సవాల అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బొట్టు బిళ్లలతో మూడు భాషల్లో జై శ్రీరామ్



జై శ్రీరామ్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఉమెన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ సభ్యులు

పంజాగుట్ట, మే 14(ఆంధ్రజ్యోతి): జంటనగరాలకు చెందిన మహిళా కళాకారులు ఉమెన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (డబ్ల్యూఏఏ)గా ఏర్పడ్డారు. బొట్టు బిళ్లలతో తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో జై శ్రీరామ్ బోర్డును అందంగా తీర్చిదిద్దారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డబ్ల్యూఏఏ సభ్యులు బొట్టుబిళ్లలతో రూపొందించిన జైశ్రీరామ్ బోర్డును ప్రదర్శించారు. ఈసందర్భంగా జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 10లోని కాసుల పద్మావతి చిత్రకళా అకాడమీ నిర్వాహకురాలు కాసుల పద్మావతి, కొండాపూర్‌కు చెందిన ఆర్ట్ టీచర్ సూర్యకుమారి, బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఆర్ట్ టీచర్లు యోగలక్ష్మి, ప్రతిభాదల్, తిరుమలగిరికి చెందిన డ్రాయింగ్ టీచర్ రజని మంచికంటి, సదాశివపేటకు చెందిన ఆర్ట్ టీచర్, రచయిత కోమలి బృందంగా ఏర్పడ్డారు. తమ ప్రాజెక్టుకు అయోధ్య అని పేరు పెట్టారు. గతనెల 19న 30 గీ 40 అంగుళాల బోర్డుపై తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో బొట్టు బిళ్లలు ఉపయోగించి జై శ్రీరామ్ అని రాశారు. 12రోజుల పాటు రోజుకు 5 గంటలు వెచ్చించి బోర్డు పూర్తి చేశారు. దీనికి 32,970 బొట్టుబిళ్లలు వినియోగించారు. 16,314 నారింజ, 3,192 బ్లూ, 13,464 ఆకుపచ్చ బొట్టు బిళ్లలతో జైశ్రీరామ్ బోర్డును తీర్చిదిద్దారు. ప్రతిరూప కళాకారుడు డి.నాగేశ్వరరావు నుంచి ప్రేరణ పొంది రూపొందించినట్టు తెలిపారు. అయోధ్యకు వెళ్లి రామాలయం మ్యూజియంకు దీన్ని అందజేస్తామన్నారు. ఇప్పటికి తాను 220 రికార్డులు సాధించానని కాసుల పద్మావతి తెలిపారు.

శాఖలవారీగా ఖాళీలను గుర్తించని ప్రభుత్వం



ఖాళీల వివరాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బక్క జడ్సన్, పృథ్వీరాజ్, విఠల్ తదితరులు

పంజాగుట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. శాఖల వారీగా ఎన్ని ఖాళీలు ఉన్నాయో కూడా నేటికీ గుర్తించలేదని వరంగల్, నల్లగొండ, ఖమ్మం నియోజకవర్గం పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్ ఆరోపించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు పృథ్వీరాజ్, విఠల్, తదితరులతో కలిసి 2023 డిసెంబర్ 31 నాటికి ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ఏర్పడ్డ తెలంగాణలో నేటికీ అవి పూర్తి కాలేదన్నారు. శాఖల వారీగా ఖాళీలు గుర్తించలేదన్నారు. తాను ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత ఖాళీలు భర్తీ చేసే వరకు పోరాటం చేస్తామన్నారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం



ఆంధ్రప్రదేశ్‌లో సోమవారం జరిగిన ఎన్నికలు ముగించుకుని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో ప్రధాని నరేంద్ర మోదీ వేసిన నామినేషన్‌కు హాజరై బేగంపేట విమానాశ్రయంలో హైదరాబాద్ చేరుకున్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయడుకు మంగళవారం మధ్యాహ్నం టీటీడీపీ ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన పార్టీ శ్రేణులతో కలిసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రసూన బాబుకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు.

- అమీర్‌పేట, మే 14(ఆంధ్రజ్యోతి)

చంద్రహాస్‌కు అవార్డు



యూసుఫ్‌గూడకు చెందిన న్యాయవాది చంద్రహాస్ వివిధ రంగాల్లో ప్రతిభ చూపినందుకు గ్లోబల్ ఏక్సలెన్సీ అవార్డు(జీఈఏ)ను బ్రాండ్ ఎంపవర్ సంస్థ అందజేసింది. మంగళవారం ముంబాయిలో జరిగిన ఓ కార్యక్రమంలో చంద్రహాస్‌కు సంస్థ ప్రతినిధులు అవార్డును ప్రముఖ నటి శిల్పాశెట్టి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

- యూసుఫ్‌గూడ, మే 14(ఆంధ్రజ్యోతి)



భగీరథుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

భగీరథుడికి నివాళి

బంజారాహిల్స్, మే 14(ఆంధ్రజ్యోతి): అయోధ్య సింహాసనాన్ని అధిరోహించిన భగీరథుడు భువిపై స్వర్గం ప్రాప్తించాలని గంగాదేవిని ప్రార్థిస్తూ హిమాలయల్లో తపస్సు చేశాడని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మంగళవారం ఫిలింనగర్‌లోని భగీరథుడి జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పలువురు నాయకులు పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వనం సంగీతయాదవ్, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు చిన్న శ్రీశైలం యాదవ్‌తో పాటు నాయకులు శ్రీనివాస్ యాదవ్, మామిడి నర్సింగ్‌రావు, మధుసాగర్, నగేష్, రాజన్న పాల్గొన్నారు.



సైఫాబాద్ డివిజన్ సబ్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ చేసిన మెట్రోజోన్ సీజీఎం నరసింహస్వామి

24 గంటలు అలర్ట్‌గా ఉండాలి

హైదరాబాద్ సిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి విధుల్లో ఉండే ఇంజనీర్లు, సిబ్బంది 24 గంటలు అలర్ట్‌గా ఉండాలని, ఎక్కడా విద్యుత్‌సరఫరాలో 5 నిమిషాలు నిలిచినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని మెట్రోజోన్ సీజీఎం నరసింహస్వామి అధికారులకు సూచించారు. హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్ సైఫాబాద్ డివిజన్, బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలోని పలు సబ్‌స్టేషన్లు, ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేయడంతో పాటు వర్షాలు పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే ఎఫ్ఓసీ సిబ్బంది నిమిషాల్లో సంఘటన స్థలంలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలు మరో 15రోజులు ఉండటంతో వేసవికాలం పూర్తయ్యే వరకు పెరుగుతున్న విద్యుత్‌డిమాండ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఈలకు సూచించారు.

తీసుకున్న డబ్బు ఇమ్మన్నందుకు కత్తితో దాడి

అమీర్‌పేట, మే 14(ఆంధ్రజ్యోతి): తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వమన్నందుకు కోపంతో ఊగిపోయిన వ్యక్తి కత్తితో దాడికి పాల్పడిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సనత్‌నగర్‌లోని అశోక్‌కాలనీకి చెందిన మహ్మద్ అహ్మద్ ఖాన్ ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి 11:30గంటల ప్రాంతంలో తన మిత్రులు ఖలీమ్, సయ్యద్, జాహిద్‌తో కలిసి అమీర్‌పేట ప్రాంతానికి టీ తాగేందుకు వెళ్లారు. తిరిగి వస్తూ మార్గమధ్యలో బీకేగూడ వద్ద కూరగాయాల సంతలో నిమ్మకాయల వ్యాపారం చేస్తున్న అమీన్‌ను కలిశారు. అహ్మద్ ఖాన్ మిత్రుడైన ఖలీమ్ వద్ద గతంలో అమీన్ రూ. 5 వేలు తీసుకున్నాడు. తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వాలని ఖలీమ్ అడగడంతో ఘర్షణ జరిగింది. అహ్మద్ ఖాన్, ఖలీమ్, జాహిద్ తిరిగి బైక్‌పై వెళ్లబోగా కోపంతో అమీన్ కత్తి తీసుకుని వారిపై దాడి చేశాడు. దీంతో అహ్మద్ ఖాన్ కత్తిపోట్లకు గురయ్యాడు. వెంటనే స్థానికులు బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అమీన్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

బీజేపీ నాయకుడు విజిత్‌పై కేసు

యూసఫ్‌గూడ, మే 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించి పోలింగ్ కేంద్రంలోనే ఓటర్లను బీజేపీకి ఓటు వేయమని అడిగిన బీజేపీ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ విజిత్‌వర్మపై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వెంగళరావునగర్‌లోని ఓ పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లి ఆయన ఓటర్లను బీజేపీకి ఓటు వేయమని అడిగినట్టు అక్కడ విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ ఫిర్యాదు చేశాడు. కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని మధురానగర్ పోలీసులు మంగళవారం తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయించిన ఇద్దరి అరెస్టు

ఖైరతాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా మద్యం దుకాణాలను మూసివేయగా అక్రమంగా బ్లాక్‌లో మందు విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం రాత్రి 10 గంటల సమయంలో చింతలబస్తీలో మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం అందుకున్న మహిళా ఎస్ఐ రమణ అక్కడకు వెళ్లి చూడగా అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మహదేవ్ (26), జిజాబాయి ((65)ను అరెస్టు చేసి వారి నుంచి 9.44 లీటర్ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

రద్దీలేని వేళల్లో రాయితీ ఎందుకు?

● కాంటాక్ట్ లెస్ కార్డ్స్‌పై ప్రయాణికుల పెదవి విరుపు
● నాన్ పీక్ అవర్స్‌లో ఆఫర్‌ను అమలు చేయడంపై విమర్శలు
● 10 శాతం మంది కూడా వినియోగించుకోని పరిస్థితి

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైళ్లలో రాయితీలను నామమాత్రంగానే అమలు చేస్తున్నారు. పేరు కోసం కొన్ని డిస్కౌంట్లను ప్రకటిస్తున్నప్పటికీ.. అవి అందరికీ ఉపయోగపడని పరిస్థితి నెలకొంది. దీంతో ఎల్‌అండ్ టీ అధికారుల తీరుపై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. అన్ని వేళల్లో కొనసాగించాల్సిన రాయితీలను కొన్ని గంటల వరకే పరిమితం చేయడంపై విమర్శిస్తున్నారు. మెట్రో రైళ్లలో ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. మూడు నెలల క్రితం రోజుకు 4.50 లక్షల మంది ప్రయాణించగా.. నెలన్నర రోజులుగా 4.80 లక్షల నుంచి 5.10 లక్షల మంది గరిష్ఠంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో రైల్వేస్టేషన్లు, రైళ్లలో ఎప్పుడు చూసినా రద్దీ కనిపిస్తోంది. రద్దీకి అనుగుణంగా అధికారులు 3నిమిషాలకోసారి రైళ్లను నడిపిస్తున్నారు. ప్రయాణికుల సంఖ్య క్రమేపీ పెరుగుతున్నప్పటికీ.. వీలైనన్నీ ఎక్కువ ఆఫర్లను అందుబాటులోకి తీసుకురావాల్సిన ఎల్ అండ్ టీ.. ఉన్న వాటిని కూడా పూర్తిస్థాయిలో అందించకపోతుండడంతో నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

ఉపయోగపడని కాంటాక్ట్ లెస్ కార్డ్స్

పెరుగుతున్న ప్రయాణికులను ఆకట్టుకునేందుకు ఎల్‌అండ్‌టీ సంస్థ పలు రకాల ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా స్మార్ట్‌కార్డు, సూపర్ సేవర్ ఆఫర్(ఎస్ఎస్ఓ)- 59 డిస్కౌంట్, కాంటాక్ట్ లెస్ కార్డ్స్(సీఎస్‌సీ) కార్డులను ప్రవేశపెట్టింది. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి 11 గంటల వరకు(నాన్ పీక్ అవర్స్‌లో) కాంటాక్ట్ లెస్ కార్డుల ద్వారా చేసే బుకింగ్స్‌పై 10శాతం రాయితీ అందిస్తున్నారు. సదరు ఆఫర్‌ను కేవలం 10శాతం మంది మాత్రమే వినియోగిస్తుండగా.. 90శాతం మంది దూరంగా ఉంటున్న పరిస్థితి కనిపిస్తోంది. పీక్ అవర్స్(ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సాయంత్రం 4 నుంచి 9గంటల వరకు)లో కాంటాక్ట్ లెస్ కార్డులను అమలుచేస్తే అందరికీ ప్రయోజనం ఉంటుందని, రద్దీలేని సమయంలో రాయితీ ఇవ్వడం ద్వారా ఎవరికీ ఉపయోగం ఉండదని ప్రయాణికులు వాపోతున్నారు.

పీక్ అవర్స్‌లోనూ కొనసాగించాలి..

పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని పీక్ అవర్స్‌లోనూ ఆఫర్లను కొనసాగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రధానంగా 10 శాతం రాయితీతో కూడిన కాంటాక్ట్ లెస్ కార్డులను అన్నివేళల్లో అమలు చేయడం ద్వారా చాలామంది వినియోగించుకుంటారని చెబుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సూపర్ సేవర్-59, స్మార్ట్ కార్డు, కాంటాక్ట్ లెస్ కార్డుపై 10 శాతం, డిజిటల్ క్యూఆర్ టికెట్స్‌పై ఉన్న 10 శాతం రాయితీ ఎత్తివేయడంతో ప్రయాణికుల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. మే 1 నుంచి ఆయా ఆఫర్లను కొనసాగిస్తామని అధికారులు ప్రకటించడం గమనార్హం.

ధర్మపురి క్షేత్రంలో 19న త్రిమూర్తుల కల్యాణం

మియాపూర్, మే 14(ఆంధ్రజ్యోతి): మియాపూర్ మదీనగూడలోని శ్రీధర్మపురి క్షేత్రంలో ఈనెల 19న త్రిమూర్తుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు క్షేత్రం నిర్వాహకులు సత్యవాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఏకాదశి పర్వదినం సందర్భంగా క్షేత్రంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులైన త్రిమూర్తుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.



తాటిముంజలు అమ్ముతున్న చిరువ్యాపారి

జోరుగా తాటిముంజల అమ్మకాలు

చిలకలగూడ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి క్రిమిసంహారక మందులు, ఎరువులు వాడకుండా ప్రకృతిలో సహజంగా లభించేవి తాటి ముంజలు. ప్రస్తుతం మార్కెట్‌లో విరివిగా లభ్యమవుతున్నాయి. నీటి శాతం, పీచు పదార్థం అధికంగా వుండి శరీరాన్ని చల్లబరుస్తాయి, వేసవి కాలంలో మాత్రమే దొరికే వీటికి డిమాండ్ ఎక్కువగా వుంది. మెట్టుగూడ, ఆలుగడ్డ బావి పక్కన రోడ్డుకి ఇరువైపుల గంపలలో పెట్టుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. నాయక్ అనే వ్యాపారిని ఆంధ్రజ్యోతి పలకరించగా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని, ధర విషయానికి వస్తే డజను వంద రుపాయాలకి అమ్ముతున్నామని, లేత ముంజలకి డిమాండ్ బాగా వుందని, ట్రాఫిక్‌కి ఇబ్బంది లేకుండా అమ్మకాలు సాగిస్తుండటంతో పోలీసుల నుంచి ఎటువంటి ఇబ్బందులు లేవని తెలిపాడు.

సికింద్రాబాద్ ఆర్యవైశ్యక్లబ్ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు



బౌద్ధనగర్, మే14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఆర్యవైశ్యక్లబ్ అధ్యక్షుడిగా సీతాఫల్‌మండి నామాలగుండుకు చెందిన ప్రొద్దుటూరి వెంకటేశ్వరరావు (బాబు) నియమితులయ్యారు. గత పదమూడేళ్ల క్రితం ఆర్యవైశ్యక్లబ్‌లో చేరిన వెంకటేశ్వరరావు ఈసీ సభ్యుడు, ప్రధానకార్యదర్శి తదితర హోదాల్లో పనిచేసి పలు సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్య కులస్తుల సంక్షేమానికి పాటుపడతానని, అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. ఆర్యవైశ్యక్లబ్ సభ్యుడిగా ఆయన ప్రమాణస్వీకారం చేశారు.

న్యాయవాదుల సంక్షేమం కోసం వంద కోట్లు

సీఎంకు అభినందనలు తెలిపిన న్యాయవాదులు

అడ్డగుట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో న్యాయవాదుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వంద కోట్లు నిధులు మంజూరు చేసినందుకు సికింద్రాబాద్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వసంత్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ కోర్టు ఆవరణలో ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల్ని పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం గర్వకారణమన్నారు. తెలంగాణ చరిత్రలో న్యాయవాదుల సంక్షేమం, యోగక్షేమాలు తెలుసుకున్న సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బెల్ట్ షాపులపై ఉక్కుపాదం

తిరుమలగిరి, మే 14 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల ప్రచారంలో బెల్ట్ షాపులు నిర్వహించిన పలువురిపై కేసులు నమోదు చేశామని తిరుమలగిరి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ విజయ్ తెలిపారు. తిరుమలగిరి లాల్‌బజార్ శాస్త్రీనగర్‌కు చెందిన భవాని బెల్టు షాపు నిర్వహిస్తుంది. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి శాంతిభద్రతల దృష్ట్యా పక్కా సమాచారంతో బెల్ట్ షాపుపై రైడింగ్ చేసి 27బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. అదే ప్రాంతంలో నివాసం ఉంటు బెల్టు షాపు నిర్వహిస్తున్న భాను అనే మహిళ ఇంటిపై రైడింగ్ చేయగా 30మందు సీసాలు లభించాయి. వీరిద్దరి మీద కేసు నమోదుచేశామని ఇన్‌స్పెక్టర్ విజయ్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో చనిపోయి ఉన్న ఓగుర్తుతెలియని మృతదేహన్ని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు మార్చురీకి తరలించారు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పార్సిల్ కార్యాలయం వద్ద మంగళవారం గుర్తుతెలియని 55 ఏళ్ల వ్యక్తి మృతదేహం పడి ఉందని సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు టి-సాట్ మెలకువలు

- టి.సాట్ - సాఫ్ట్ నెట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం టీఎస్పీఎస్సీ ఆధ్వర్యంలో మే 20 నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించే టెట్ (టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్)కు హాజరయ్యే అభ్యర్థులకు మెలకువలు తెలియచేసేందుకు టి-సాట్ ప్రత్యేక ప్రసార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని టి.సాట్-సాఫ్ట్ నెట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మే 15 బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు ఐదు సబ్జెక్టులపై అనుభవం కల్గిన ఉపాధ్యాయులచే ప్రత్యేక లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. టి-సాట్ నిపుణ ఛానల్‌లో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు గంట పాటు ప్రత్యేక ప్రసారాల ద్వారా టెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు పరీక్ష రాసే విధానంలో పలు మెళకువలతో పాటు సలహాలు-సూచనలు అందించనున్నామని తెలిపారు. 15 వ తేదిన సైకాలజీ పరక్షపైన, 16న టీచింగ్ మెథడ్స్, 17న తెలుగు, 18న ఫిజికల్ సైన్స్, మాథ్స్ సబ్జెక్టులపై కొనసాగే ప్రసారాలు నిపుణ ఛానల్‌తో పాటు, టి-సాట్ విద్యా ఛానల్‌లో మరుసటి రోజు సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు పునఃప్రసారమవుతుందన్నారు.

ఇప్పటికే టెట్ అభ్యర్థుల కోసం సుమారు 200 ఎపిసోడ్స్ టి-సాట్ డొమైన్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. అభ్యర్థులు తమ సందేహాలు- సమాధానాల కోసం 040-3540326/726, టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 4039 నెంబర్లకు కాల్ చేయవచ్చున్నారు.

లెక్కలు.. లెక్కలు.. బిజీబిజీగా నేతలు

'ఆ బూత్‌లో మనకు ఎన్ని ఓట్లు పడిఉండవచ్చు.. ఇంకో బూత్‌లో మన ప్రత్యర్థికి ఎన్ని ఓట్లు పోలై ఉండవచ్చు. ఫలానా బూత్‌లో మనకు లాస్ట్ టైమ్ కంటే ఎక్కువ వచ్చి ఉండవచ్చా, లేక తక్కువగా పోలై ఉండవచ్చా?, మన ప్రత్యర్థులు డబ్బులు పంచారు కదా..... మరి ప్రజలు వారికి ఓటు వేసి ఉండవచ్చా?, డబ్బు ప్రభావం చూపిందా?' అటు లోక్‌సభ, ఇటు ఉపఎన్నిక ఓటింగ్ ముగియడంతో సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజక వర్గంలో అన్ని రాజకీయ పార్టీల నేతలు లెక్కల్లో బిజీగా గడిపారు.



సికింద్రాబాద్, మే 14(ఆంధ్రజ్యోతి): సోమవారం సాయంత్రం పోలింగ్ ముగియడంతో అర్ధరాత్రి వరకు ఫోన్లలో పరస్పరం వాకబు చేసుకున్న నాయకులు, కార్యకర్తలు.... మంగళవారం దీనిపై మరింత కూలంకుషంగా చర్చించుకోవడం కనిపించింది. గడిచిని కొన్ని రోజులుగా ఎన్నికల ప్రచారం, చివర్లో పోలింగ్ కోసం శ్రమించిన నాయకులు, కార్యకర్తలను అభినందిస్తూనే..... పోలింగ్ సరళి, ఏ పార్టీకి ఎన్ని ఓట్లు పోలై ఉండవచ్చో.... విశ్లేషణలు ప్రారంభించారు. 'ఫలానా రాజకీయ పార్టీ విపరీతంగా డబ్బులు ఖర్చు పెట్టినప్పటికీ పోలింగ్ శాతం గడిచిన అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఉండడం, పోలింగ్ శాతం పెరగకపోవడంతో ఫలితాలు ఎలా ఉండవచ్చనే' అంశమై మరో పార్టీ నేతలు తమ అనుచరులతో చర్చిస్తున్నారు.

అసలు ఆ డబ్బులు ఓటర్లందరికీ వెళ్లాయా, లేదా అనే విషయమై స్పష్టత తీసుకుంటున్నారు. అనుచరుల, కార్యకర్తల ఫీడ్ బ్యాక్‌ను బట్టి జయాపజయాలపై ఒక అంచనాకు వచ్చే యత్నం చేస్తున్నారు. కాగా పోలింగ్ ముగిసి ఒక రోజు కూడా కానందున బుధవారం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో గ్రూప్ మీటింగ్స్ ఏర్పాటు చేద్దామని, బూత్‌ల వారీగా లెక్కలు వేసుకుందామని ఆయా పార్టీల నాయకులు తమ పార్టీ శ్రేణులకు చెబుతున్నారు.

సనత్‌నగర్ ఓటర్ల తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ

- కమలం పార్టీకి ఆధిక్యత వచ్చేనా?
- బీఆర్ఎస్ సత్తా చూపేనా?
- కాంగ్రెస్ పూర్వవైభవం సాధించేనా?



సికింద్రాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీల సమ్మేళనంగా విలసిల్లుతున్న సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల తీర్పుపై ప్రస్తుతం ఆసక్తి నెలకొన్నది. సిటీ పాలిటిక్స్‌కు కేరాఫ్‌గా నిలిచే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో తాజా లోక్‌సభ ఎన్నికల్లో ఈ సెగ్మెంట్ నుంచి ఏ పార్టీకి మెజారిటీ వస్తుందనే విషయమై ఉత్కంఠ నెలకొన్నది. గత లోక్‌సభ ఎన్నికల్లో ఈ సెగ్మెంట్‌లో బీఆర్ఎస్‌కు 37,679 ఓట్లు, బీజేపీకి 52,515 ఓట్లు, కాంగ్రెస్‌కు 18,410 ఓట్లు పోలయ్యాయి. ఆ తర్వాత జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో నియోజకవర్గంలోని రాంగోపాల్‌పేట్, అమీర్‌పేట్, మోండ మార్కెట్ డివిజన్లను బీజేపీ కైవసం చేసుకుంది. దాంతో గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు విశేషంగా శ్రమించాయి. ఫలితంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున తలసాని శ్రీనివాస్‌యాదవ్ మరోసారి విజయం సాధించారు. తాజా లోక్‌సభ ఎన్నికల్లో తన సోదర సమానమైన పద్మారావు బీఆర్ఎస్ తరఫున పోటీ చేస్తుండడంతో తలసాని నేతృత్వంలో బీఆర్ఎస్ శ్రేణులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగా ఈ సారి కూడా ముస్లింలు, క్రైస్తవులు, బస్తీలు, కాలనీల ఓటర్లు తమకు అండగా నిలుస్తారని, సనత్‌నగర్‌లో బీఆర్ఎస్‌కు మెజారిటీ వస్తుందని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు విశ్వసిస్తున్నారు. అయితే లోక్‌సభ ఎన్నికల్లో సనత్‌నగర్ ఓటర్లు తమ పార్టీకి అనుకూలంగా ఉండడం ఆనవాయితీగా వస్తోందని, ఈసారి కూడా అదే పునరావృతమవుతుందని బీజేపీ శ్రేణులు ధీమాగా ఉన్నాయి. ఇదిలా ఉండగా మొదటి నుంచీ సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉందని, తాజాగా రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకున్నందున లోక్‌సభ ఎన్నికల్లో హస్తం పార్టీకి మెజారిటీ వస్తుందని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి.

రద్దీ లేని వేళల్లో రాయితీ ఎందుకు..?

- కాంటాక్ట్ లెస్ కార్డ్స్‌పై ప్రయాణికుల పెదవి విరుపు
- నాన్ పీక్ అవర్స్‌లో ఆఫర్‌ను అమలు చేయడంపై విమర్శలు
- 10 శాతం మంది కూడా వినియోగించుకోని పరిస్థితి
- పీక్ అవర్స్‌లోనూ డిస్కౌంట్ కొనసాగించాలని డిమాండ్

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మెట్రో రైళ్లలో రాయితీలను నామమాత్రంగానే అమలు చేస్తున్నారు. పేరుకోసం కొన్ని డిస్కౌంట్లను ప్రకటిస్తున్నప్పటికీ.. అవి అందరికీ ఉపయోగపడని పరిస్థితి నెలకొంది. దీంతో ఎల్‌అండ్‌టీ అధికారుల తీరుపై ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. అన్ని వేళల్లో కొనసాగించాల్సిన రాయితీలను.. కొన్ని గంటల వరకే పరిమితం చేయడంపై విమర్శిస్తున్నారు. నగరంలోని మెట్రో రైళ్లలో ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. గత మూడు నెలల క్రితం రోజుకు 4.50 లక్షల మంది ప్రయాణించగా.. నెలన్నర రోజులుగా 4.80 లక్షల నుంచి 5.10 లక్షల మంది గరిష్ఠంగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో రైల్వేస్టేషన్లు, రైళ్లలో ఎప్పుడు చూసినా రద్దీ కనిపిస్తోంది. దీంతో రద్దీకి అనుగుణంగా అధికారులు 3 నిమిషాలకోసారి రైళ్లను పంపిస్తున్నారు. అయితే ఓ వైపు మెట్రోలో ప్యాసింజర్ల సంఖ్య క్రమేపీ పెరుగుతున్నప్పటికీ.. వీలైనన్ని ఎక్కువ ఆఫర్లను అందుబాటులోకి తీసుకురావాల్సిన ఎల్‌అండ్‌టీ.. ఉన్న వాటిని కూడా పూర్తిస్థాయిలో అందించకపోతుండడంతో నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

ఉపయోగపడని కాంటాక్ట్ లెస్ కార్డ్స్..

పెరుగుతున్న ప్రయాణికులను ఆకట్టుకునేందుకు ఎల్‌అండ్‌టీ సంస్థ వినూత్న రకాల ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా స్మార్ట్ కార్డు, సూపర్ సేవర్ ఆఫర్ (ఎస్ఎస్ఓ)- 59 డిస్కౌంట్, కాంటాక్ట్ లెస్ కార్డ్ (సీఎస్‌సీ) కార్డులను ప్రవేశపెట్టింది. అయితే ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి 11 గంటల వరకు (నాన్ పీక్ అవర్స్‌లో) కాంటాక్ట్ లెస్ కార్డుల ద్వారా చేసే బుకింగ్స్‌పై 10 శాతం రాయితీ అందిస్తున్నారు. దీంతో సదరు ఆఫర్‌ను కేవలం 10 శాతం మంది మాత్రమే వినియోగిస్తుండగా.. 90 శాతం మంది దూరంగా ఉంటున్న పరిస్థితి కనిపిస్తోంది. పీక్ అవర్స్ (ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకు)లో కాంటాక్ట్ లెస్ కార్డులను అమలుచేస్తే అందరికీ ప్రయోజనం ఉంటుందని, రద్దీ లేని సమయంలో రాయితీ ఇవ్వడం ద్వారా ఎవరికి ఉపయోగం ఉండదని ప్రయాణికులు వాపోతున్నారు.

పీక్ అవర్స్‌లోనూ కొనసాగించాలి..

పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని పీక్ అవర్స్‌లోనూ ఆఫర్లను కొనసాగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రధానంగా 10 శాతం రాయితీతో కూడిన కాంటాక్ట్ లెస్ కార్డులను అన్నివేళల్లో అమలు చేయడం ద్వారా చాలామంది వినియోగించుకుంటారని చెబుతున్నారు.

ఇదిలా ఉండగా, ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి సూపర్ సేవర్-59, స్మార్ట్ కార్డు, కాంటాక్ట్ లెస్ కార్డుపై 10 శాతం, డిజిటల్ క్యూఆర్ టికెట్స్‌పై ఉన్న 10 శాతం రాయితీ ఎత్తివేయడంతో ప్రయాణికుల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. దీంతో మరుసటి రోజు మే 1 నుంచి ఆయా ఆఫర్లను యధావిధిగా కొనసాగిస్తామని అధికారులు ప్రకటించడం గమనార్హం.



పోస్టరును ఆవిష్కరిస్తున్న బక్క జడ్సన్, పృథ్వీరాజ్, విఠల్ తదితరులు

శాఖల వారీగా ఖాళీలను నేటికీ గుర్తించలేదు : బక్క జడ్సన్

పంజాగుట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాఖల వారీగా ఎన్ని ఖాళీలు ఉన్నాయో నేటికీ గుర్తించలేదని వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్ ఆరోపించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు పృథ్వీరాజ్, విఠల్, తదితరులతో కలిసి 2023 డిసెంబర్ 31నాటికి తెలంగాణలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాల పోస్టరును ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం నవంబర్ 25న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన సభలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. శాఖల వారీగా ఎన్ని ఖాళీలు ఉన్నాయో కూడా నేటికీ గుర్తించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. డిసెంబర్ 2023 నాటికి అన్ని శాఖల్లో 2,67,316 పోస్టులు ఖాళీగా ఉన్నట్టుగా తాము గుర్తించామని పేర్కొన్నారు.





రేణుక ఎల్లమ్మ అమ్మవారు, పూజల్లో పాల్గొన్న భక్తులు

నల్లపోచమ్మ, రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

మౌలాలి, మే 14 (ఆంధ్రజ్యోతి): మౌలాలి డివిజన్ పూలపల్లి బాలయ్యనగర్ కాలనీలోని శ్రీ నల్లపోచమ్మ, రేణుక ఎల్లమ్మ దేవాలయ 12వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాయంత్రం కలశ పూజ, గంగ, పుట్ట బంగారం తీసుకురావడం, రాత్రి రేణుక ఎల్లమ్మ ఒగ్గు కథ పారాయణం చేపట్టారు. ఈ పూజలలో స్థానికులు, భక్తులు, దేవాలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. మంగళవారం రేణుక ఎల్లమ్మ కల్యాణోత్సవం అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు పాండురంగ రావు తెలిపారు.

బొట్టుబిళ్లలతో మూడు భాషల్లో జై శ్రీరామ్

- అయోధ్యలోని బాల రామాలయం మ్యూజియంకు ఇస్తాం
- 12 రోజులు 60 గంటలు... 32,970 బొట్టుబిళ్లల వినియోగం



బొట్టుబిళ్లలతో మూడు భాషల్లో తయారు చేసిన జై శ్రీరామ్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఉమెన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ సభ్యులు

పంజాగుట్ట, మే 14 (ఆంధ్రజ్యోతి): జంటనగరాలకు చెందిన మహిళా కళాకారులు ఉమెన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (డబ్ల్యూఏఏ)గా ఏర్పడ్డారు. తమలో ఉన్న ప్రతిభను ప్రదర్శించడానికి ఏమైనా చేద్దామని అనుకున్నారు. అయోధ్యలో రామాలయం ప్రారంభం కావడంతో ఏమైనా కళాఖండాన్ని తయారు చేసి మ్యూజియంకు ఇద్దామని భావించారు. వినూత్నంగా బొట్టుబిళ్లలతో తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లో జై శ్రీరామ్ బోర్డును అందంగా తీర్చిదిద్దారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉమెన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (డబ్ల్యూఏఏ)సభ్యులు బొట్టుబిళ్లలతో తాము రూపొందించిన జైశ్రీరామ్ బోర్డును ప్రదర్శించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 10లోని కాసుల పద్మావతి చిత్రకళా అకాడమీ నిర్వాహకురాలు కాసుల పద్మావతి, కొండాపూర్‌కు చెందిన ఆర్ట్ టీచర్ సూర్యకుమారి, బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఆర్ట్ టీచర్లు యోగలక్ష్మి, ప్రతిభాదల్, తిరుమలగిరికి చెందిన డ్రాయింగ్ టీచర్ రజని మంచికంటి, సదాశివపేటకు చెందిన ఆర్ట్ టీచర్, రచయిత కోమలిలు ఒక బృందంగా ఏర్పడ్డారు. తమ ప్రాజెక్టుకు అయోధ్య అని పేరు పెట్టారు. గతనెల 19న 30 ఇంటూ 40అంగుళాల బోర్డుపై తెలుగు, హిందీ, ఇంగ్లీష భాషల్లో బొట్టు బిళ్లలు ఉపయోగించి జై శ్రీరామ్ అని అందంగా రాశారు. తమ రోజు వారీ పనులు చేసుకుంటూ 12 రోజులపాటు రోజుకు ఐదు గంటల సమయాన్ని వెచ్చించి పూర్తిచేశారు. ఇందుకు 32,970 బొట్టుబిళ్లలు వినియోగించారు. 16,314 నారింజ, 3,192 బ్లూ, 13,464 ఆకుపచ్చ బొట్టుబిళ్లలతో అద్భుతంగా తీర్చిదిద్దారు.

ప్రతి రూప కళాకారుడు డి.నాగేశ్వరరావు నుంచి ప్రేరణ పొంది దీనిని రూపొందించడం జరిగిందన్నారు. రామాలయం ప్రారంభమై సంవత్సరం పూర్తి చేసుకునే సందర్భంగా ఈ సంవత్సరం డిసెంబర్ నెలలో అయోధ్యకు వెళ్లి రామాలయం మ్యూజియంకు ఈ కళాఖండాన్ని అందజేస్తామని వారు తెలిపారు. ఒక ఛాలెంజ్‌గా తీసుకుని పనిని పూర్తిచేయడం పట్ల తమకు సంతోషంగా ఉందని వారు వెల్లడించారు. ఇప్పటికి తాను 220 రికార్డులు సాధించానని కాసుల పద్మావతి తెలిపారు.

ప్రెషర్ లేక, నీళ్లు తక్కువై.. బస్తీవాసుల ఇబ్బందులు

- ఫిర్యాదు చేసినా స్పందించని వాటర్‌వర్క్స్ అధికారులు



బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్న యువకులు



ఖాళీగా ఉన్న సంపు

రెజిమెంటల్‌బజార్, మే 14 (ఆంధ్రజ్యోతి) : నల్లా నీళ్లు రాకపోవడం, వస్తేలో ప్రెషర్ కారణంగా తాగునీరు లేక ఇబ్బందులుపడుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని బస్తీవాసులు వాపోతున్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం మోండా డివిజన్ పరిధిలోని సాంబమూర్తినగర్‌లో రెండు వారాల నుంచి నల్లా నీళ్లు రావడంలేదని బస్తీవాసులు ఆంధ్రజ్యోతి ప్రతినిధికి తెలిపారు. వాటర్‌వర్క్స్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఫోన్‌లు చేస్తున్నారని తమ ఫోన్ నెంబర్‌లను బ్లాక్‌లిస్టులో పెట్టారని తెలిపారు. డీజీఎం దృష్టికి తీసుకెళ్తే కొత్త పైపులైన్ వేస్తామన్నారు కానీ వేయలేదు. రెండు సంవత్సరాల నుంచి ఇబ్బందిపడుతున్నామని, గత రెండు వారాల నుంచి అసలు నీళ్లు రావడంలేదని తెలిపారు. 15 కుటుంబాలు నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నామని, దూరం నుంచి నీళ్లు తెచ్చుకుని వాడుకుంటున్నామని బస్తీవాసి ప్రభుకుమార్ తెలిపారు.

సొంత ఇలాకాలో పజ్జన్నకు ఆధిక్యత దక్కేనా?

సికింద్రాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంపై ప్రస్తుతం అందరి దృష్టి కేంద్రీకృతమైంది. మోండ మార్కెట్ డివిజన్ కార్పొరేటర్ స్థాయి నుంచి రాష్ట్ర మంత్రిగా ఎదగడమే కాకుండా సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో తిరుగులేని నేతగా రూపొందిన తీగుల్ల పద్మారావుగౌడ్ తొలిసారిగా లోక్‌సభ అభ్యర్థిగా బరిలో నిలవడం ఆసక్తిగా మారింది. సికింద్రాబాద్ సిట్టింగ్ శాసనసభ్యునిగా ఉన్న పద్మారావు బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తుండడంతో గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఊపును కొనసాగిస్తూ ఈ ఎన్నికల్లో మెజారిటీ సాధిస్తారా, లేక... గత లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగా బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డికి ఆధిక్యత దక్కుతుందా, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారాన్ని హస్తగతం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ సత్తా చూపుతుందా? అనే విషయమై ఆసక్తి నెలకొన్నది.

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు పునరావృతమయ్యేనా?

సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని ఐదు మున్సిపల్ డివిజన్లలో బీఆర్ఎస్‌కు చెందిన కార్పొరేటర్లు ఉన్నారు. అన్ని డివిజన్లలో ద్వితీయశ్రేణి నాయకులు, కార్యకర్తలతో పార్టీ పటిష్టంగా ఉంది. దాంతోపాటు ముస్లిం, క్రైస్తవ ఓటర్లు 40వేలకుపైగా ఉంటారని అంచనా. అలాగే అడ్డగుట్ట, మాణికేశ్వర్‌నగర్ లాంటి పెద్ద బస్తీలు ఉన్నాయి. ఇక్కడి ఓటర్లలో అత్యధిక శాతం గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పద్మారావుకు అండగా నిలిచారు. ఫలితంగా పద్మారావుకు భారీ మెజారిటీ వచ్చింది. తాజాగా పద్మారావు లోక్‌సభ ఎన్నికల బరిలో నిలవడంతో మరోసారి పద్మారావుకు అండగా నిలుస్తారని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆశిస్తున్నాయి. తాజా ఎన్నికల్లో సిటీలో ఎక్కడా లేని విధంగా సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో అత్యధికంగా 53శాతం పోలింగ్ జరగడం తమకు అనుకూలంగా ఉంటుందని వారు భావిస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఈ సెగ్మెంట్ నుంచి బీజేపీకి 51,266 ఓట్లు రాగా, బీఆర్ఎస్‌కు 42,251 ఓట్లు, కాంగ్రెస్‌కు 24,999 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో పద్మారావు అభ్యర్థిగా నిలవడంతో బీఆర్ఎస్‌కు ఆధిక్యత వస్తుందని వారు ధీమాగా ఉన్నారు. అయితే గత లోక్‌సభ ఎన్నికల మాదిరిగా ఈ ఎన్నికల్లో కూడా కమలం పార్టీకి ఆధిక్యత వస్తుందని బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి. మోదీ చరిష్మా మరింత పెరిగిందని, మైనారిటీ ఓట్లు కాంగ్రెస్-బీఆర్ఎస్‌ల మధ్య చీలిపోయాయని, మోదీ ప్రభుత్వంపై విశ్వాసంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన ఓటర్లు సైతం ఈసారి తమకు ఓటు వేశారని బీజేపీ భావిస్తోంది. దాంతో సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఆధిక్యతపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది.



స్ట్రాంగ్‌రూంకి సీల్‌వేస్తున్న కలెక్టర్ శశాంక, ఎన్నికల అధికారులు

స్ట్రాంగ్‌రూంకు చేవెళ్ల సెగ్మెంట్ ఈవీఎంలు.. సెక్యూరిటీ పటిష్టం

గచ్చిబౌలి. మే14 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలోని శేరిలింగంపల్లి సెగ్మెంట్‌కు సంబంధించిన ఈవీఎంలు మంగళవారం సా యంత్రానికి చేవెళ్లలోని స్ట్రాంగ్‌రూంకు చేరాయి. సోమవారం జరిగిన ఎన్నికల సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం లో మొత్తం 633 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను అధికారులు గచ్చిబౌలిలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అధికారులు పోలింగ్ సిబ్బంది నుంచి స్వాధీనం పరుచుకున్నారు. వాటిని మంగళవారం ఉదయం భారీ బందోబస్తు నడుమ చేవెళ్లలోని స్ట్రాంగ్‌రూంకి తరలించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక, ఎన్నికల నిర్వహణ అధికారి, జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ ఎన్నికలు సాఫీగా నిర్వహించడంలో పాటు ఈవీఎంలను పోలీసుల సమక్షంలో స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచి గదులకు సీల్ వేశారు. కలెక్టర్ శశాంక్ మాట్లాడుతూ, అధికార యంత్రాంగం, పోలింగ్ సిబ్బంది మూడు రోజులుగా శ్రమించి ఎన్నికలు సజావుగా నిర్వహించినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

హనుమత్ వాహనంపై శ్రీనివాసుడి ఊరేగింపు

భెల్‌కాలనీ, మే14 (ఆంధ్రజ్యోతి): హనుమత్ వాహనంపై సతీసమేతుడైన శ్రీనివాసుడి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర, యోగేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిత్యపూజతో పాటు, అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను హనుమత్ వాహనంపై అలంకరించి దేవాలయ ప్రాంగణంలో ఊరేగించారు.



ఈటల రాజేందర్‌తో భేటీ అయిన మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి తదితరులు

ఈటలతో మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి భేటీ

రామంతాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌తో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు భేతి సుభాష్‌రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఉప్పల్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో సోమవారం జరిగిన ఎన్నికల సరళిని ఈటలకు సుభాష్‌రెడ్డి వివరించారు. ఓటర్ల నుంచి బీజేపీకి సానుకూల స్పందన లభించిందని, మల్కాజిగిరిలో బీజేపీ గెలుపు అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయని ఈటలకు తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ తన గెలుపు కోసం పనిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు హనుమంతరావు, మహేష్‌కుమార్, ఫణీంద్ర, రవీందర్‌రెడ్డి, చంద్రమౌళి, రవీందర్ రెడ్డి, లక్ష్మణ్, శైలేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు